తిరుత్తణి మురుగన్ ఆలయానికి పోటెత్తిన భక్తులు 7

జాలరి వలలో చిక్కిన మొసలి



చిరుత దాడిలో ఐదేళ్ల బాలుడి మృతి 8

జీఎస్టీ కమిషనరేట్‌లో అగ్నిప్రమాదం

16న ఈరోడ్‌లో టీవీకే ప్రచార సభ



- 2నెలల తరువాత రాష్ట్రంలో విజయ్ బహిరంగసభ
- భద్రత కోరుతూ కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రం

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ఈ నెల 16వ తేదీన ఈరోడ్‌లో భారీ బహిరంగ సభ చేపట్టనుంది. ఇందులో ఆ పార్టీ అధ్యక్షుడు, సినీ హీరో విజయ్ పాల్గొని ప్రసంగించనున్నారు. గతంలో కరూర్‌లో జరిగిన టీవీకే ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెల్సిందే. ఈ విషాదకర సంఘటన తర్వాత విజయ్ ఒక్క ప్రచార సభలో కూడా పాల్గొనలేదు. పైగా కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాల సభ్యులను నేరుగా వెళ్లి కలుసుకుని పరామర్శించలేదు. కానీ, ఆ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయం చెక్కులను మృతుల కుటుంబాలను చెన్నైకు ప్రత్యేక బస్సుల్లో రప్పించి విజయ్ స్వయంగా అందజేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీన టీవీకే నేతలు ఈరోడ్ వేదికగా భారీ ప్రచార సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు భారీ భద్రత కల్పించాలని కోరూతూ ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్‌తో సహా పలువురు నేతలు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆ తర్వాత కేఏ సెంగోట్టయ్యన్ విలేఖరులతో మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన విజయ్ రాష్ట్ర పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. ఈరోడ్ పెరుందురై సాలైలో ఒక ప్రైవేటు స్థలాన్ని ఈ ప్రచార సభకు ఎంపిక చేశామన్నారు. ఈ ప్రచార సభ నిర్వహణ కోసం ప్రభుత్వం, పోలీసులు ఎలాంటి షరతులు విధిస్తారో వాటిని తు.చ తప్పకుండా పాటించి ఈ సభను విజయవంతంగా నిర్వహించ తలపెట్టినట్టు తెలిపారు. అదేసమయంలో ఈరోడ్‌లో రోడ్ షోను రద్దు చేసినట్టు తెలిపారు. టీవీకేతో కాంగ్రెస్ నేతలు చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నారా? లేదా? అన్నది ఆ పార్టీ నేతలనే అడగాలని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ కూడా తమ సిద్ధాంతాలతో ఏకీభవించే పార్టీలతో కలిసి పని చేసేందుకు ఆసక్తి చూపుతాయన్నారు. అదేసమయంలో తాను అన్నాడీఎంకే నుంచి టీవీకేలో చేరేటప్పుడు ఎలాంటి నిబంధన విధించలేదన్నారు. కాగా, టీవీకే ప్రచార సభకు భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్ కందస్వామిని కలిసి వినతి సమర్పించిన నేతల్లో కేఏ సెంగోట్టయ్యన్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు ఉన్నారు. అలాగే, జిల్లా ఎస్పీ కార్యాలయంలో కూడా మరో వినతి పత్రం అందజేశారు.



'మదురై-2024' పేరుతో విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు

మదురైలో పెట్టుబడిదారుల సదస్సు

సక్సెస్

- సీఎం స్టాలిన్ వెల్లడి
- రూ.36 వేల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు
- ఇప్పటివరకు 34 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- మదురై 2044 విజన్ డాక్యుమెంట్ రిలీజ్

చెన్నై, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మదురై వేదికగా ఆదివారం జరిగిన పెట్టుబడిదారుల సదస్సు విజయవంతమైందని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ సదస్సులో రూ.36,660 కోట్ల విలువ చేసే పారిశ్రామిక ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా 'మదురై 2044' పేరుతో రూపొందించిన ప్రత్యేక విజనరీ డాక్యుమెంట్‌ను సీఎం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రభుత్వం కుదుర్చుకున్న పారిశ్రామిక ఒప్పందాల వల్ల 34 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చితికిపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ఎంతో అవశ్యమని భావించి తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఆర్థిక రంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు భారీగా పెట్టుబడులను ఆకర్షించాలని భావించామన్నారు. ఇందులో భాగంగా యూఏఈ, సింగపూర్, జపాన్, స్పెయిన్, అమెరికా, జర్మనీ, ఇంగ్లండ్ వంటి అనేక విదేశాలకు వెళ్లి పెట్టుబడిదారులను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పించామన్నారు. భారత్‌లో వ్యాపారం చేయడానికి తొలి ప్రవేశ ద్వారం తమిళనాడే అనేలా సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించామన్నారు. దీనిని రుజువుచేసేలా పెట్టుబడిదారుల సదస్సు లన ం క్రమం త ప్ప కుండా నిర్వ హిస్తున్నావ ం న్నారు. ఇందులో భాగంగానే తూత్తుకుడి, హోసూర్, కోయంబత్తూరు నగరాల్లో ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లను నిర్వహించామన్నారు. ఇపుడు మదురై వేదికగా నిర్వహించామన్నారు. ఇందులో 91 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.36,660 కోట్ల విలువ చేసే పెట్టుబడులను ఆకర్షించి 55,766 మందికి ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకున్నామన్నారు.రాష్ట్రాభివృద్ధిలో పెట్టుబడులు ఎంతో కీలకమన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధితో ముందుకు సాగుతున్నామన్నారు. తమ సారథ్యంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు రూ.11.83 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, తద్వారా 34 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, ఈ ఒప్పందాలు ఎంతవరకు అమలు చేశారనే దానిపై క్రమం తప్పకుండా సమీక్షలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 80 శాతం ఒప్పందాలు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ మదురై నగరానికి 'తూంగా నగరం' అనే మరో పేరు కూడా ఉందన్నారు.మదురై నగరం అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడివుందన్నారు. ఇందులో భాగంగా మదురై 2044 పేరుతో ఒక విజనరీ డాక్యుమెంట్‌ను రూపొందించామన్నారు. మదురైలో రూ.314 కోట్ల వ్యయంతో టైడల్ పార్క్ నిర్మాణం సాగుతోందన్నారు. ఆ తర్వాత శివగంగై, విరుదునగర్, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో కూడా టైడల్ పార్కులను నిర్మిస్తామన్నారు. రామనాథపురంలో కొత్తగా టైడల్ పార్క్ నిర్మాణం ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. కోవై, హోసూర్‌లలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సుల ద్వారా లక్ష కోట్ల రూపాయల మేరకు పెట్టుబడులను ఆకర్షించి, 2 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించామని సీఎం స్టాలిన్ వెల్లడించారు. ఇదిలా వుండగా ఈ పర్యటనలోనే మదురైలో 278 ఎకరాల విస్తీర్ణంలో సిప్‌కాట్ పారిశ్రామికవాడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, పెరియకరుప్పన్, రాజకన్నప్పన్, మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్ రాయ్‌తోపాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సమానత్వ దీపం

రాష్ట్రంలో సమానత్వ దీపం ఎప్పటికీ వెలుగుతుందని, అభివృద్ధి వెలుగు విస్తరిస్తోందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో ప్రకటన విడుదల చేశారు. "మదురైలోని కలైంజర్ సెంటినరీ లైబ్రరీ, కలైంజర్ సెంటినరీ ఆడిటోరియం, బ్రహ్మాండమైన కీళడి మ్యూజియం, ప్రపంచస్థాయి హాకీ మైదానం... ఇవి మన ద్రావిడ మోడల్ పాలన మాట్లాడే మదురై అభివృద్ధి రాజకీయాలు. ఎయిమ్స్ రాదు, మెట్రోరైలు సౌకర్యం కల్పించలేం, కీళడి నివేదిక దాచిపెట్టడం.. ఇవీ బీజేపీ మాట్లాడే రాజకీయాలు. రాష్ట్రంలో సమానత్వ దీపం ఎప్పటికీ వెలుగుతుంది. అభివృద్ధి వెలుగు విస్తరిస్తోంది" అంటూ సీఎం ప్రకటించారు.

దేశ భద్రత కోసం సమష్టిగా పనిచేద్దాం

- గవర్నర్ పిలుపు
- ఘనంగా 'ఫ్లాగ్ డే'



లోక్ భవన్‌లో ఫ్లాగ్ డే కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్

చెన్నై, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రత, స్థితి స్థాపకత, స్వావలంబనను బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పిలుపునిచ్చారు. ఆదివారం లోక్‌భవన్‌లో 'ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే' సందర్భంగా ప్రత్యేక కరపత్రాన్ని ఆవిష్కరించిన గవర్నర్.. సైనిక కుటుంబాల సంక్షేమం కోసం ఫ్లాగ్‌డే నిధికి రూ.5లక్షలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఇంకా రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపనుల శాఖ కార్యదర్శి ఆర్.కిర్లోశ్ కుమార్, ముఖ్య కార్యదర్శి కె.బాలసుబ్రమణ్యం, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక సందేశం వెలువరించారు. పవిత్రమైన 'సాయుధ దళాల పతాక దినోత్సవం' సందర్భంగా మన సరిహద్దులను, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుతున్న మన సాయుధదళంలోని ధీరులైన పురుషులు, మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోజు మన దేశాన్ని, మన ప్రజలను సురక్షితంగా వుంచే నిస్వార్థ సేవ, ధైర్యం, త్యాగాన్ని గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. "భారత సాయుధ దళాల వృత్తి నైపుణ్యం, శౌర్యం, విధి పట్ల అచంచలమైన అంకితభావం ప్రపంచంలోనే అత్యుత్తమమైనవి. సియాచిన్ వంటి మంచుపర్వతాల్లో, రాజస్థాన్ ఎడారుల్లో, ఈశాన్యంలోని దట్టమైన అడవుల్లో, సముద్ర ప్రయోజనాలను కాపాడే సుదూర జలాల్లో మన యూనిఫారం ధరించిన సిబ్బంది ప్రతిరోజూ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శిస్తారు. శత్రుక్రతువుల నుంచి మన సరిహద్దులను కాపాడటం, విపత్తు సహాయ కార్యకలాపాలకు తమ బలాన్ని అందించడం వంటి వారి సేవలకు అవధుల్లేవు. ఇటీవల ఆపరేషన్ సింధూర్‌లో మన సాయుధ బలగాలు అచంచలమైన క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యం ప్రపంచానికి కనిపించింది. ఇది సంకల్పం, సంయమనం, అత్యంత వ్యూహాత్మక స్పష్టతతో అమలు చేయబడిన ఒక మిషన్. మన బలగాలు బాధ్యతా విలువలను నిలబెట్టాయి. అమాయక ప్రాణాలను కాపాడటానికి మాత్రమే దురాక్రమణకు ప్రతిస్పందించారు. శాంతి, ఉద్రిక్తతలకు వ్యతిరేకంగా మన నిబద్ధత కొనసాగుతూనే, మన సైనికులు, నావికులు, వైమానిక యోధులు ఖచ్చితత్వం, సున్నితత్వం, ధైర్యంతో పని చేస్తూ, పాకిస్థాన్‌పై నిర్ణయాత్మక విజయాన్ని సాధించినప్పుడు మొత్తం ప్రపంచం సంభ్రమాశ్చర్యాలతో పాటు గౌరవంగా చూసింది" అని గవర్నర్ కొనియాడారు. భారత ప్రపంచ వేదికపై ఎదుగుతున్న కొద్దీ.. రక్షణలో స్వావలంబన ద్వారా జాతీయ భద్రతను బలోపేతం చేయడం అత్యంత ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికత ద్వారా మార్గనిర్దేశం చేయబడిన, దేశం అధునాతన ఫిరంగి, డ్రోన్ల నుంచి నావికా నౌకలు, యుద్ధవిమానాల వరకు స్వదేశీ రక్షణ సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయ డ ం లో గణనీయమైన పురోగతిని సాధిస్తోందన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం అనేది సమర్థవంతమైన భారత్-సాధికారత కలిగిన సైన్యం యొక్క స్ఫూర్తిని గౌరవించడానికి కూడా పిలుపుగా పేర్కొన్నారు. యూనిఫారంలో వున్న సాయుధ బలగాలనే కాకుండా ప్రతి సవాల్‌లోనూ వారికి అండగా నిలిచిన కుటుంబాలను కూడా గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ రోజు యూనిఫారంలో వున్న వారి ధైర్యానికి మనం సెల్యూట్ చేస్తుండగా, మన అనుభవజ్ఞులు, వీరనారీమణులు, ప్రతి సైనికుడి వెనుక నిలబడిన కుటుంబాలకు కూడా హృదయపూర్వక నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజున మన సాయుధ దళాల సిబ్బందిని గౌరవించడం, మద్దతు ఇవ్వడం, ఐక్యంగా నిలబడడం అనే మన ప్రతిజ్ఞను పునరుద్ఘాటిద్దామని పిలుపునిచ్చారు. ప్రతి యువ భారతీయుడిలో మన సాయుధ దళాల పట్ల గర్వాన్ని నింపుదామన్నారు. ఇది మనలో ప్రతి ఒక్కరూ సింబాలిక్‌గా జెండాల ద్వారా మాత్రమే కాకుండా మన దేశానికి అత్యున్నత అంకితభావంతో సేవ చేసిన మన సైనికులు, వారి కుటుంబాలకు అర్థవంతమైన మద్దతు ద్వారా మన సంఘీభావాన్ని వ్యక్తపరచగల రోజు అని గవర్నర్ పేర్కొన్నారు. సాయుధ దళాల జెండా దినోత్సవ నిధికి విరివిగా విరాళాలు ఇవ్వడం ద్వారా మద్దతు పలుకుదామన్నారు. రాష్ట్ర ప్రజలంతా సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఉదారంగా, నిండు హృదయంతో విరాళాలు ఇవ్వాలని గవర్నర్ విజ్ఞప్తి చేశారు.

అమరవీరుల కుటుంబ సంక్షేమం కోసం విరాళాలివ్వండి: సీఎం

అమరవీరుల ఆత్మ శాంతి కోసం, వారి కుటుంబాల శ్రేయస్సు కోసం 'ఆర్మ్‌డ్ ఫోర్సెస్ డే' సందర్భంగా విరాళాలు ఇవ్వడం పౌరుల విధి అని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ డే సందర్భంగా సైనిక కుటుంబాల సంక్షేమ నిధికి విరాళం అందించిన సీఎం.. ఓ ప్రకటన విడుదల చేశారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఆయన అమరవీరులకు, వారి కుటుంబాలకు హృదయపూర్వక సంతాపం తెలిపారు.

పుదువైలో సీఎం వర్సెస్ గవర్నర్

- అనుమతులు ఇవ్వని ఎల్జీ
- దూరమైన సీఎం రంగస్వామి



రంగస్వామి, కైలాష్ నాథన్

పుదుచ్చేరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కైలాష్ నాథన్‌కు, ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామికి మధ్య ఏమాత్రం పొసగడం లేదు. రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన బిల్లులకు కూడా గవర్నర్ ఆమోదం తెలపడం లేదు. ఇది ముఖ్యమంత్రి రంగస్వామికి ఆగ్రహం తెప్పిస్తోంది. దీంతో ఎల్జీ పాల్గొనే అధికారిక కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హాజరుకావడం లేదు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ పరిస్థితులను బేరీజు వేస్తున్న సీఎం రంగస్వామి బీజేపీతో తెగదెంపులు చేసుకుని హీరో విజయ్ సారథ్యంలోని టీవీకేతో కలిసి ముందుకు సాగాలన్న ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. వచ్చే సంక్రాంతి పండుగకు అర్హులైన పేదలకు ఉచితంగా బియ్యం, చక్కెరతో పాటు పొంగల్ కానుక ఇచ్చేందుకు, కొత్తగా 10 వేల మందికి వృద్ధాప్య పింఛన్లు, ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న 3500 పోస్టుల భర్తీకి గవర్నర్ ఆమోదం తెలిపారు. అయితే, దీపావళి పండుగకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు దీపావళి గిఫ్టు, టపాసుల బాక్స్, స్వీట్స్ వంటివి ఇచ్చే ప్రతిపాదనకు ఎల్జీ మోకాలొడ్డారు. అలాగే, పుదుచ్చేరిలో ఏడు మద్యపాన తయారీ కంపెనీలకు కూడా గవర్నర్ అనుమతి ఇవ్వలేదు. ఈ కంపెనీల ఏర్పాటు వల్ల రాష్ట్రంలో భూగర్భ జలాలు అడుగంటిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ చర్యలు ఎల్జీ, సీఎంకు మధ్య దూరాన్ని పెంచాయి. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన పథకాలకు కూడా గవర్నర్ అనుమతి ఇవ్వకపోవడంతో ముఖ్యమంత్రి రంగస్వామికి ఆగ్రహం తెప్పించింది. దీంతో ఎల్జీ పాల్గొనే ప్రభుత్వ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హాజరుకావడం లేదు. అయితే, గవర్నర్ అనుమతులు ఇవ్వకపోవడం వెనుక రాష్ట్రానికి చెందిన బీజేపీ నేతల హస్తం ఉందని ఎన్ఆర్ కాంగ్రెస్ శ్రేణులు బలంగా నమ్ముతున్నాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో బీజేపీతో కాకుండా, టీవీకేతో కలిసి పయనించాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. అయితే, దీనిపై ముఖ్యమంత్రి రంగస్వామి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్ వైఖరి సీఎంకు ఆగ్రహం తెప్పించడంతో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీల మధ్య పొత్తు కటీఫ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తిరుప్పరంకుండ్రం వ్యవహారంపై రాజకీయాలొద్దు

- నయినార్ నాగేంద్రన్‌పై స్పీకర్ అప్పావు విమర్శ



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న స్పీకర్ అప్పావు

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం శైవక్షేత్రంలో కార్తీక దీపం వెలిగించే వ్యవహారాన్ని రాజకీయం చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్‌పై అసెంబ్లీ స్పీకర్ అప్పావు విమర్శలు గుప్పించారు. తిరునల్వేలిలో సంప్రదాయ క్రీడలు నిర్వహిస్తున్న సంస్థ ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కర్రసాము పోటీలను ఆదివారం స్పీకర్ అప్పావు ప్రారంభించారు. ఈ పోటీల్లో యువతీ, యువకులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, సాహస క్రీడా కళాకారులు, కోచ్‌లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీలను ప్రారంభించిన అనంతరం అప్పావు మాట్లాడుతూ.. కర్రసాము, కత్తిసాము, కలరీ విద్య తదితర సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించేలా సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం పథకాలు అమలుపరుస్తోందని, ప్రైవేటు సంస్థలు కూడా ఈ పోటీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో త్రిభాష విద్యావిధానాన్ని అమలుపరచాలని చెప్పే అధికారం యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్‌కు లేదని, విశ్వవిద్యాలయాలకు సలహాలు చెప్పడం మాత్రమే వారి కర్తవ్యమని, త్రిభాష విధానాన్ని అమలుచేయాలా వద్దా అనే అధికారం, హక్కు రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న యూనివర్శిటీలకే ఉందన్నారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు కూడా స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో, కేంద్రప్రభుత్వం యూజీసీ, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తదితర సంస్థలను బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలకు పంపిస్తోందని ఆరోపించారు. ప్రజలు దైవంగా భావిస్తున్న న్యాయస్థానాల్లో కూడా కేంద్రప్రభుత్వం ఆధిపత్యం చలాయిస్తోందని వ్యాఖ్యానించారు. గత నాలుగు రోజులుగా రాష్ట్రంలో తిరుప్పరంకుండ్రంలో కార్తీక దీపం వెలిగించే వ్యవహారంపై హిందూ సంస్థలు రాష్ట్రప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ఈ సంస్థలను ప్రోత్సహించేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ కూడా వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారాన్ని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. మదురైకు ఎయిమ్స్ ఆస్పత్రి, మెట్రోరైలు పథకాలు అవసరమని, వాటిని అమలుపరచడంలో కేంద్రం శ్రద్ధచూపాలన్నారు. దేశానికి తమిళనాడు ఆదర్శంగా ఉందని, ద్రావిడ మోడల్ ప్రభుత్వాన్ని కదిలించడం ఎవ్వరి తరం కాదని అప్పావు ధీమావ్యక్తం చేశారు.

పోరాట స్ఫూర్తి మాత్రమే విజయానికి మార్గం

● గేయ రచయిత కరుణాకరన్



పోరాట స్ఫూర్తి మాత్రమే వైఫల్యాలను అధిగమించి విజయానికి బాటలు వేస్తుందని ప్రముఖ సినీ గేయ రచయిత కరుణాకరన్ అన్నారు. ఆయన తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 'వల్లవన్' చిత్రంలో నా సినీ కెరీర్‌ను ప్రారంభించాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు అంతా సాఫీగా సాగిపోతోంది. తాజాగా 'నిర్వాగం పొరుప్పల్ల', 'కిణరు' వంటి సినిమాలకు పాటలు రాశాను. విశాల్ నటిస్తున్న 'మకుటం', 'లైఫ్‌టుడే' చిత్రాలకు సాహిత్యాన్ని అందిస్తున్నాను. వీటితో పాటు అనిరుధ్, జీవీ ప్రకాష్ కుమార్, యువన్ శంకర్ రాజా వంటి సంగీత దర్శకులు పని చేసే చిత్రాలకు కూడా పాటలు రాస్తున్నాను. నా కళా ప్రయాణం పోరాటాలతో నిండి వుంది. ఒక వికలాంగుడు ఏమి పాటలు రాస్తాడంటూ చాలామంది హేళన చేశారు. అలాంటి వారికి ఇప్పటివరకు నేను రాసిన పాటలే సమాధానం. దీనికి మించి నాపై నాకు అమితమైన నమ్మకం ఉంది. కన్నదాసన్, వాలి వంటి గొప్ప రచయితలను ఆదర్శంగా తీసుకుని నా ప్రతిభను నమ్ముకుని పరిశ్రమలోకి అడుగుపెట్టాను. కవి వాలి నాకు గొప్ప చోదకశక్తి వంటివారు. అలాగే, నన్ను ప్రేమించే దర్శకులు, సంగీత స్వరకర్తలు, నటులు, నిర్మాతలకు నేను రుణపడి వుంటాను. 'మకుటం' చిత్రంలో అవకాశం కల్పించిన దర్శక హీరో విశాల్‌కు నా ప్రత్యేక ధన్యవాదాలు. 'మామనిదన్'లో విజయ్ సేతుపతికి, 'ఫీనిక్స్'లో విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతికి పాటలు రావడం మరుపురాని అనుభూతినిచ్చింది' అని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మోసాలను వివరించే 'నిర్వాగం పొరుప్పల్ల'

ప్రతి నిత్యం చోటుచేసుకుంటున్న ఆన్‌లైన్ మోసాలను కళ్లకుకట్టినట్టు వివరించేలా 'నిర్వాగం పొరుప్పల్ల' చిత్రాన్ని రూపొందించారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్లు మొబైల్‌ను హ్యాక్ చేసి ఎలాంటి మోసాలకు పాల్పడుతారో ఇందులో వివరించారు. ఈ మూవీకి కార్తీశ్వరన్ దర్శకత్వం వహించడమేకాకుండా హీరోగా కూడా నటించారు. తన నలుగురు స్నేహితులు కలిసి ఆన్‌లైన్ మోసానికి పాల్పడి రూ.5 వేల కోట్లకు పైగా సంపాదిస్తారు. ఆ మోసపూరిత డబ్బుతో విదేశాలకు పారిపోవాలని కార్తీశ్వరన్ ప్రయత్నిస్తాడు. అతను చేసిన మోసాలు ఏమిటి? పోలీసులకు ఎలా చిక్కాడన్నదే ఈ చిత్ర కథ. సమాజంలో మోసగాళ్లు ఉన్నంత వరకు మోసాలు జరుగుతూనే ఉంటాయన్న సందేశాత్మకంగా కార్తీశ్వరన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలో చూపించిన మోసాలను చూస్తే మొబైల్ ఫోన్‌ను తాకేందుకు కూడా ప్రతి ఒక్కరూ భయపడతారని దర్శకుడు అంటున్నారు. కేవలం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మాత్రమే ఇలాంటి సన్నివేశాలను చిత్రంలో ఉంచినట్టు వివరించారు. అయితే, ప్రతి రోజూ ఆన్‌లైన్‌లో వివిధ రకాలైన గేమ్స్ ఆడుతూ డబ్బు పోగొట్టుకునే వారికి మాత్రం ఈ చిత్రం మరింత నిరాశను కలిగిస్తుందని కార్తీశ్వరన్ అంటున్నారు. కాగా, ఈ చిత్రంలో కార్తీశ్వరన్‌తో సహా అతని స్నేహితులుగా ఆధవన్, అహల్యా వెంకటేశన్, లివింగ్ స్టార్, బ్లాక్‌పాండీ తదితరులు నటించారు. శ్రీకాంత్ దేవా సంగీతం.

చిత్రజ్యోతి



'నిర్వాగం పొరుప్పల్ల'లో ఓ దృశ్యం



రసియ

కోలీవుడ్‌కు హీరోయిన్‌గా మాల్దీవుల భామ

తమిళ చిత్రపరిశ్రమకు మరో కొత్త హీరోయిన్ పరిచయమయ్యారు. మాల్దీవులకు చెందిన రసియ 'పుత్తం పుదు నేరం' అనే చిత్రంలో కథానాయికిగా నటించారు. పి.చంద్రకుమార్ రూపొందించిన ఈ చిత్రానికి కె.పరంజ్యోతి సంగీతం. ఈ మూవీలో ఇద్దరు హీరోయిన్లు నటించగా, వారిలో ఒకరు రసియ. తన సినీ రంగ ప్రవేశంపై రసియ మాట్లాడుతూ, 'నాకు ఎలాంటి సినీ నేపథ్యం లేదు. మాల్దీవుల నుంచి తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన తొలి యువతిని నేనే. పాఠశాల చదువుకునే రోజుల నుంచే సినిమా అంటే అమితమైన ప్రేమ. ఇందు కోసం డ్యాన్స్, నటనలో శిక్షణపొందాను. నా ప్రతిభను గుర్తించి దర్శకుడు అవకాశం ఇచ్చారు. ఆయనకు జీవితాంతం రుణపడివుంటాను. ముందు మరిన్ని తమిళ చిత్రాల్లో నటించాలన్నదే నా కోరిక' అని వివరించారు.

బ్లాక్ కామెడీ - సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో 'సావి'

బ్లాక్ పాండి, సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో 'సావి' పేరుతో ఒక చిత్రాన్ని దర్శకుడు ఆంటోనీ అజిత్ తెరకెక్కించారు. డ్రగ్ సంస్కృతిపై సమాజంలో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఈ చిత్రంలో ప్రధాన పాత్రను పోషించిన ఉదయ్ దీప తన ఇద్దరు మామల హత్యల వెనుక వున్న కుట్రను ఛేదించేందుకు ప్రత్నిస్తుంటాడు. అదేసమయంలో ఒక మామ కుమార్తెల్లో ఒకరిని ప్రేమించి పెళ్లి చేసుకునేందుకు సమాయత్తమవుతాడు. ఇంతలో ఒక మామ చనిపోతాడు. అతని అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా, శవం కనిపించకుండా పోతుంది. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆదేశ్ బాల తన బృందంతో కలిసి మృతదేహం కోసం గాలిస్తుంటారు. ఇంతలోనే మరో మామ హత్యకు గురవుతాడు. ఈ ఇద్దరు మామల మృతి వెనుక ఉన్న మిస్టరీ ఏంటి.? తానే ప్రేమించిన అమ్మాయిని ఉదయ్ దీప వివాహం చేసుకున్నాడా? లేదా? అన్నదే ఈ సినిమా స్టోరీ. ఇందులో ఉదయ దీప్, ఆదేశ్ బాల పాటు యాసర్, మాస్టర్ విజయ్, కవిత సురేష్, ప్రేమ్ కె.శేషాద్రి తదితరులు నటించారు. శరణ్ రాఘవన్, వీజే రఘురాం సంగీతం అందించారు. బ్లాక్ కామెడీ, సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కించిన ఈ చిత్రంలో డ్రగ్ కల్చర్, సమాజ చైతన్యం తదితర అంశాలను స్పృశిస్తూ సినిమా కథ సాగుతుందని దర్శకుడు ఆంటోనీ అజిత్ పేర్కొన్నారు.



'సావి'లో ఉదయ్ దీప్, కవిత సురేష్

తిరుత్తణి మురుగన్ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకారంలో వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారు

తిరుత్తణి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస ప్రత్యేక పూజలు, ఆదివారం సెలవుదినం కావడంతో తిరువళ్లూరు జిల్లాలో ప్రసిద్ధిచెందిన తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, కేరళ తదితర రాష్ట్రాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో వల్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకార పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీనితో ఆలయ ప్రాంగణాలు భక్తుల 'హరోం హర' దివ్య నామస్మరణతో మారుమోగాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు.



తిరుప్పరంకుండ్రం కొండ దీపస్తంభం వద్ద పోలీసు భద్రత

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై ఉన్న దీపస్తంభం వద్ద పోలీసు భద్రత ఏర్పాటుచేశారు. తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై ఉన్న దీపస్తంభానికి కార్తీక దీపం వెలిగించాలని హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు అమలు కాకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం, కేంద్ర భద్రతా బలగాల భద్రత నడుమ పిటిషన్‌దారుడు కార్తీక దీపం వెలిగించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు కూడా అమలుకాలేదు. అదే సమయంలో, హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలుచేసింది. ఈ పరిస్థితుల్లో, తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై భారీగా పోలీసులు మోహరించారు. కొండ శిఖరంపై ఉన్న దర్గాకు వెళ్లేందుకు, కాశీ విశ్వనాథర్ ఆలయానికి వెళ్లేందుకు ఎవరినీ అనుమతించడం లేదు. కొండ పైకి వెళ్లేందుకు వస్తున్న భక్తులను పోలీసులు అడ్డుకుని తిప్పి పంపుతున్నారు. కొండ శిఖరంపై ఉన్న దీపస్తంభం, దర్గా వద్ద పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.



విశ్వమానవ భాషగా సంగీతం

● ఎస్పీబీ కల్చరల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేఎం కొండయ్య



కొండయ్యను శాలువాతో సత్కరిస్తున్న సంగీత కళాకారులు

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో వేలాది భాషలు ఉన్నాయని, కానీ సంగీతం అనేది విశ్వమానవ భాషగా ఉందని డా.ఎస్పీబీ కల్చరల్ ట్రస్ అధ్యక్షులు, దక్షిణ రైల్వే మాజీ టీటీఆర్ కేఎం కొండయ్య అభిప్రాయపడ్డారు. ఆయన ఆదివారం 62వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా స్థానిక మాధవరం సమీపంలోని పొన్నియమ్మన్‌మేడు బృందానం గార్డెన్‌లో ఉన్న కేఎస్ రిహార్సల్ స్టూడియోలో సంగీత కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ విభావరిలో గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం పలు భాషా చిత్రాల్లో పాడి ప్రాచుర్యం పొందిన పాటలను శ్రావ్యంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. సహ కళాకారుల సత్కారం అందుకున్న అనంతరం కేఎం.కొండయ్య మాట్లాడుతూ, దివంగత ఎస్పీబీ పేరుతో స్థాపించిన ట్రస్ట్ ద్వారా ప్రతిఏటా ఆర్థికంగా వెనుకబడిన కళాకారులకు తమవంతు సహాయం అందిస్తున్నామని, యువ గాయనీ, గాయకులను పరిచయం చేసే భాగ్యం తమ సంస్థకు కలిగిందన్నారు. ఏర్పాట్లను ట్రస్ట్ నిర్వాహకులు బాలాజీ తదితరులు పర్యవేక్షించారు.

కన్నులపండువగా తెప్పోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

వేలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ కార్తీక దీపోత్సవాలు గత నెల 24వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వేడుకల్లో ప్రధానాంశమై కొండ శిఖరంపై మహాదీపం వెలిగించే కార్యక్రమం ఈ నెల 3వ తేదీన జరిగింది. ఉత్సవమూర్తులు ప్రతిరోజు వివిధ వాహనాల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో, శనివారం రాత్రి 9 గంటలకు అయ్యన్ కొలనులో వల్లి, దేవయాని సమేత సుబ్రమణ్యస్వామి తెప్పోత్సవం జరిగింది. ప్రత్యేక అలంకరణలో, విద్యుద్దీపాల తెప్పలో ఉత్సవమూర్తులు కొలనులో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులు చేసిన 'హరోం హర' దివ్య నామస్మరణతో ఆ ప్రాంగణం మార్మోగింది.



స్వామివారిని దర్శించుకుంటున్న ఎస్పీ అయిమాన్ జమాల్

షోళింగర్ నరసింహుడి సేవలో ఎస్పీ అయిమాన్ జమాల్

తిరుత్తణి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా షోళింగర్‌లో ప్రసిద్ధి చెందిన యోగ నరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం ఉదయం రాణిపేట ఎస్పీ అయిమాన్ జమాల్ సందర్శించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక ఆరాధన ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ అయిమాన్ జమాల్ ఆదిలక్ష్మీ సమేత యోగ నరసింహస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

జాలరి వలలో చిక్కిన మొసలి

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాలరి వలలో మొసలి చిక్కడం కలకలం రేపింది. కడలూరు జిల్లా చిదంబరం సమీపం కె.ఆరూర్ గ్రామంలోని చెరువులో జాలర్లు చేపలు పట్టేందుకు వలలు విసిరారు. కానీ, వలలో చేపలు కాకుండా మొసలి చిక్కింది. వల పైకి లాగిన జాలర్లు, అందులో మొసలి ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెంది, వలను మొసలికి చుట్టి తీరానికి తీసుకొచ్చారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు జాలర్లు సమాచారం అందించారు. అధికారులు అక్కడకు చేరుకుని 5 అడుగుల పొడవు, 30 కిలోల బరువున్న మొసలిని స్వాధీనం చేసుకుని సమీపంలోని నదిలో వదిలిపెట్టారు. కానీ, చెరువులో మొసలి చేరడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న జాలర్లు, అందులో మొసళ్లు ఉన్నాయా? అంటూ పరిశీలించాలని అటవీ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.



మొసలిని బంధించిన జాలర్లు

మదురైలో వీరవనిత వేలునాచ్చియార్ ఫ్లైఓవర్ ప్రారంభం

● రూ.2,630కోట్ల పథకం పనులను ప్రారంభించి సీఎం స్టాలిన్



వీరవనిత వేలునాచ్చియార్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు.. ఫ్లైఓవర్ వ్యూ

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మదురైలో వాహనాల రద్దీని నివారించే దిశగా మేళమడై-గోమతిపురాన్ని కలిపే రీతిలో తొండి రహదారిలో రూ.150కోట్ల వ్యయంతో వీరవనిత 'వేలునాచ్చియార్' పేరుతో నిర్మించిన కొత్త ఫ్లైఓవర్‌ను ఆదివారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. మదురైలో ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరం నుంచి సీఎం స్టాలిన్ విమానం ద్వారా మదురైకి వెళ్లారు. విమానాశ్రయంలో మంత్రులు, కలెక్టర్, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు సీఎంను ఆహ్వానించారు. ఆదివారం ఉదయం సీఎం కరుప్పాయూరనిలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మేళమడై చేరుకున్నారు. అక్కడ రూ.150కోట్లతో వీరవనిత వేలునాచ్చియార్ పేరుతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. ఆ ఫ్లైఓవర్ సమీపంలో జల్లికట్టు పోటీలను గుర్తుచేసే విధంగా ఏర్పాటుచేసిన గాంగేయం ఎద్దు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆ తర్వాత మదురై జిల్లాలో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.2,630.88కోట్ల వ్యయంతో పూర్తిచేసిన కొత్త పథకాల పనులను ఆయన ప్రారంభించారు. మరో రూ.17.18కోట్ల విలువతో నూతన పథకాలకు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.150కోట్ల విలువకు 1,41,119 మంది లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు, 63,698 మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. కార్మికుల సంక్షేమం బోర్డు ఆధ్వర్యంలో 260 మంది మహిళలు, దివ్యాంగులకు రూ.2కోట్ల 58 వేల విలువ గల పింక్ ఆటోలను పంపిణీ చేశారు. అదేవిధంగా తమిళనాడు పట్టణాభివృద్ధి బోర్డు తరుపున 50 మంది రూ.4,62,50,000 విలువతో నిర్మించిన గృహాల ఇంటితాళాలను అందజేశారు. దివ్యాంగులు 737 మందికి స్కూటర్, మూడు చక్రాల సైకిళ్లు, సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.1,77,18,575 విలువతో 230 మంది ఇద్దరు ఆడపిల్లల భద్రతా పథకం నిధులు, 86 మందికి వివాహ ఆర్థికసాయాన్ని సీఎం అందజేశారు. మదురై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముల్లైపెరియార్ లోయర్ క్యాంపు ప్రాంతంలో నిర్మించిన నీటిశుద్ధీకరణ కేంద్రాన్ని, 28వ వార్డులో అదనపు నీటి కనెక్షన్లకు తాగునీటి వినియోగాన్ని స్టాలిన్ ప్రారంభించారు. ఆయనతో పాటు మంత్రులు కేఎన్.నెహ్రూ, ఏవీ.వేలు, సాత్తూరు రామచంద్రన్, తంగం తెన్నరసు, కేఆర్.పెరియకరుప్పన్, మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, టీఆర్‌బీ రాజా, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యేలు సహా పలుశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచిన 'శ్రీమద్భగవద్గీత జయంతి'

చెన్నై, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), 'హిందూ ధర్మ పరిషత్' సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన 'శ్రీమద్భగవద్గీత జయంతి 2025' పోటీలు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచాయి. ఆదివారం ఉదయం స్థానిక టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులో వున్న టీటీడీ సమాచార కేంద్రంలో ఈ పోటీలు జరిగాయి. 6-9 తరగతుల వారికి 14వ అధ్యాయంలో, 10-12 తరగతుల వారికి 16వ అధ్యాయంలో పోటీలు జరిగాయి. ఇందులో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సుమతి, సమాచారకేంద్ర సలహా మండలి మాజీ ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు విజేతలకు బహుమతులను అందించి, ప్రశంసించారు. వంద మందికి పైగా విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా, పదిమంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.



→ నిర్వాహకులతో విజేతలు



ఆదివారం తమ నివాసంలో సైనిక కుటుంబాల సంక్షేమం కోసం ఫ్లాగ్‌డే నిధికి



విరాళం అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

'శ్రీహెర్'లో ఘనంగా వికలాంగుల దినోత్సవం



కార్యక్రమంలో విద్యావేత్తలు

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' (శ్రీహెర్)లో ఆదివారం వికలాంగుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన వెన్నెముక కండరాల క్షీణతతో జీవిస్తున్న బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీఏ అభినంద్ తన శక్తివంతమైన జీవిత ప్రయాణాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు. ఆయన ప్రఖ్యాత పీర్ రివ్యూడ్ జర్నల్స్‌లో 20 పరిశోధనా వ్యాసాలను ప్రచురించారు. రెండు పుస్తక అధ్యాయాలను రచించారు. తన ప్రయాణాన్ని చూసే విద్యార్థులకు నిజమైన బలం ప్రతికూలతను నివారించడంలో కాదు, దానిని ఉద్దేశపూర్వక చర్యగా మార్చడంలో ఉందని ఆయన గుర్తు చేశారు. మరో అతిథిగా యూజీసీ నేషనల్ ఫెలోషిప్ గ్రహీత, క్యూ1 అంతర్జాతీయ జర్నల్స్‌లో పదికి పైగా పరిశోధనా పత్రాలను రచించిన సుష్మిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ కె.బాలాజీసింగ్, ఆడియాలజీ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ ఫ్యాకల్టీ స్పెషల్ ఆఫీసర్ రూపా నాగరాజన్, ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్ భూమినాథన్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'సూపర్ చెన్నై' ఐకాన్‌గా వెదర్ బ్లాగర్

చెన్నై, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర పౌరుల నేతృత్వంలో నడిచే 'సూపర్ చెన్నై' నవంబర్ నెల ఐకాన్‌గా వెదర్ మ్యాన్‌గా ప్రసిద్ధి చెందిన వెదర్ బ్లాగర్ ప్రదీప్ జాన్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు సూపర్ చెన్నై నిర్వాహకులు ఆదివారం పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. చెన్నై స్ఫూర్తిని, స్థాయిని పెంచే వ్యక్తులను గుర్తించి, ప్రతి నెలా సూపర్ చెన్నై సత్కరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకూ నలుగురు విభిన్న రంగాలకు చెందిన ప్రసిద్ధ వ్యక్తులను గుర్తించిన సూపర్ చెన్నై... తాజాగా ప్రదీప్ జాన్‌కు ఈ పురస్కారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రంజీత్ రాథోడ్ మాట్లాడుతూ.. ప్రదీప్ జాన్ వాతావరణ సమాచారాన్ని ప్రజలు పంచుకునే, అర్థం చేసుకునే విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని ప్రశంసించారు. ప్రదీప్ జాన్ మాట్లాడుతూ.. వాతావరణ సమాచారాన్ని సరళంగా, నమ్మదగినదిగా, సామాన్యులకు ఉపయోగకరంగా మార్చడమే తన ప్రయత్నమని పేర్కొన్నారు.



ప్రదీప్ జాన్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సమాచార దర్శిని

'అవ్వయార్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి కోసం కృషిచేస్తున్న వారు, 'అవ్వయార్' పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రపంచ మహిళా దినోత్సవం వచ్చే ఏడాది మార్చి 8వ తేది జరుపుకోనున్నారు. ఆ రోజున, మహిళల అభివృద్ధికి కృషిచేస్తున్న ఒకరికి 'అవ్వయార్' పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఆసక్తి కలిగిన వారు తమ పూర్తి వివరాలు, చేస్తున్న సేవలు తదితరాలు తెలియజేయాల్సి ఉంటుంది. పురస్కారానికి సంబంధించిన వివరాలు, దరఖాస్తులు https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకుని, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లోని సాంఘీక సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 31వ తేదిలోపు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

నేడు డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం సోమవారం జరుగనుంది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి... పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా పరిధిలోని యూనియన్, పట్టణ, గ్రామ కార్యదర్శులు, శాసనసభ, పార్లమెంటు సభ్యులు, నియోజకవర్గ పరిశీలకులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఒకే చోట కూర్చోబెట్టి సమావేశంలో పాల్గొనేలా జిల్లా కార్యదర్శులు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. 'నా పోలింగ్ స్టేషన్... విజయ పోలింగ్ స్టేషన్' అనే అంశంతో ఈ సమావేశం జరుగుతుందని దురైమురుగన్ తెలిపారు.

అన్నాడీఎంకేను బీజేపీ బెదిరించలేదు : దినకరన్

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేను బీజేపీ బెదిరించలేదని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. తిరుప్పూర్‌లో ఏఎంఎంకే ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మారథాన్ పోటీలను దినకరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2026లో అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ, తమిళగ వెట్రి కళగం (టీవీకే)ల మధ్య చతుర్ముఖ పోటీ ఉంటుందని అభిప్రాయపడ్డారు. విజయ్ ప్రారంభించిన టీవీకే నేతృత్వంలో బలమైన కూటమి ఏర్పడే అవకాశముందన్నారు. బీజేపీ అధిష్ఠానం అన్నాడీఎంకేను బెదిరించలేదని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితలు అభివృద్ధి దిశగా ముందుకు నడిపించిన అన్నాడీఎంకే మరో వందేళ్లు రాజకీయాల్లో రాణించాలంటే పార్టీని విడిచివెళ్లినవారంతా మళ్లీ తిరిగి రావాలని సూచించారు.

విజయ్ పార్టీకి అంగీకారంలేదు

● మంత్రి ఐ.పెరియస్వామి

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే)కి కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి గుర్తింపు రాలేదని, ఆ పార్టీ గురించి మాట్లాడడం సరికాదని మంత్రి ఐ.పెరియస్వామి పేర్కొన్నారు. దిండుగల్‌లో ఆయన ఆదివారం మీడియతో మాట్లాడుతూ, తిరుప్పరంకుండ్రం వ్యవహారం సుప్రీంకోర్టులో విచారణ స్థాయిలో ఉందని, రాష్ట్రప్రభుత్వానికి మద్దతుగా తీర్పు వచ్చే అవకాశముందని మంత్రి తెలిపారు. విజయ్ పార్టీకి ఇంకా రాజకీయ పార్టీ గుర్తింపు రాలేదన్నారు. ప్రజలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేకు ఓటేస్తారన్న గ్యారంటీ లేదన్నారు.

నేడు తిరువళ్లూరు జిల్లాలో నయినార్ నాగేంద్రన్ పర్యటన

తిరుత్తణి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ సోమవారం ఉదయం తిరువళ్లూరు జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీకిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా నయినార్ నాగేంద్రన్ జిల్లాలోని తిరుత్తణి, ఆర్కేపేట, అమ్మవారికుప్పం తదితర ప్రాంతాల్లో పర్యటిస్తారని, రైతులు, ఐటీ, యువజన, కార్మిక విభాగాలకు చెందిన నిర్వాహకులను ఆయన కలవనున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో బీజేపీ ఎప్పుడో కాలు మోపింది

● తమిళిసై సౌందరరాజన్

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ పాదం మోపిందని మాజీ గవర్నర్, బీజేపీ మహిళా నేత డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. డీఎంకే ఉన్నంతవరకు రాష్ట్రంలోకి కమల ప్రవేశం ఉండదనీ, ఇది కలైంజర్ భూమి... ఇక్కడ బీజేపీకి చోటు లేదంటూ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. తమ పార్టీ రాష్ట్రంలోకి ఎప్పుడో ప్రవేశించిందన్నారు. మీరు చిన్నవయసులో ఉన్నప్పుడే అదే కలైంజర్ బీజేపీతో పొత్తుపెట్టుకున్నారనే విషయాన్ని విస్మరించరాదన్నారు. పైగా బీజేపీ రాష్ట్రంలోకి అడుగుపెట్టడం వల్లే, ప్రతి రోజూ బీజేపీని ప్రస్తావిస్తున్నారని ఆమె ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.

20 ఏళ్లుగా నివసిస్తున్న లంక వాసి అరెస్టు

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత 20 ఏళ్లుగా నగరంలో అక్రమంగా నివసిస్తూ వచ్చిన ఒక శ్రీలంక వాసిని గుర్తించి చెన్నై నగర క్యూబ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలో చట్టవ్యతిరేకంగా ప్రవేశించి నివసిస్తున్న విదేశీయులను గుర్తించే పనిలో క్యూబ్రాంచ్ పోలీసులు నిమగ్నమై, అనుమానాస్పద గృహాల్లో విస్తృతంగా గాలిస్తున్నారు. ఈ చర్యల్లో భాగంగా, ఈంజంబాక్కంలో అక్రమంగా గత 20 ఏళ్లుగా ఉంటున్న లంకకు చెందిన రాజేశ్వరన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

చెన్నై, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దిండివనం జిల్లా తెన్‌పేసియార్ ప్రాంతంలో కారు చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందారు. విల్లుపురానికి చెందిన ఓ కుటుంబం ఆదివారం సాయంత్రం కారులో చెన్నై బయలుదేరగా, తెన్‌పేసియార్ ప్రాంతంలో హఠాత్తుగా హైవేపైకి వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించేందుకు ప్రయత్నించిన వాహనం డ్రైవర్ అదుపు తప్పాడు. ఈ ప్రయత్నంలో వాహనం అదుపు తప్పి, రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జీఎస్టీ కమిషనరేట్‌లో అగ్నిప్రమాదం

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ ప్రాంతంలో ఉన్న జీఎస్టీ కమిషనర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ అగ్నిప్రమాదంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, కీలక దస్తావేజులు, ఫర్నీచర్ ఆహుతయ్యాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అన్నానగర్‌లోని జీఎస్టీ కమిషనర్ కార్యాలయ ప్రాంగణం నుంచి ఉదయం 9గంటల సమయంలో పొగలు వ్యాపించడంతో స్థానికులు ఆందోళనకు గురై వెంటనే అగ్నిమాపకశాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో ఆరు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది దాదాపు రెండున్నర గంటలు శ్రమించి మంటలను అదుపుచేశారు. ఇదిలా ఉండగా, ఆ కార్యాలయం కింది అంతస్తులో ఉన్న క్యాంటీన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని పోలీసులు జరిపిన ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. దీనిపై ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక ఇబ్బంది

విద్యార్థుల మధ్య ఘర్షణ

● గాయపడిన ప్లస్ టూ విద్యార్థి మృతి

● 15 మంది ప్లస్ వన్ విద్యార్థుల అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ కారణంగా ప్లస్ టూ విద్యార్థి మృతిచెందాడు. వివరాలిలా వున్నాయి... తిరువారూరు జిల్లా వలంగైమాన్ ప్రాంతానికి చెందిన కవియరసన్ (17) తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని పట్టీశ్వరం అరింజర్ అన్నా ప్రభుత్వ మోడల్ మహోన్నత పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్నాడు. ఈ పాఠశాలలో చదువుతున్న ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో, గత సెప్టెంబరు నెలలో కవియరసన్, ప్లస్ వన్ విద్యార్థులు మళ్లీ ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ప్లస్ వన్ విద్యార్థి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ వ్యవహారంపై ఇరుతరపు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించిన పోలీసులు, వారిని హెచ్చరించి పంపించారు. అనంతరం, ఈ నెల 3వ తేది మళ్లీ వీరి మధ్య వివాదం చెలరేగింది. 4వ తేది సాయంత్రం ప్రత్యేక క్లాసు ముగించుకుని స్నేహితులతో వెళ్తున్న కవియరసన్‌పై ప్లస్ వన్ విద్యార్థులు దాడిచేశారు. ఈ దాడిలో తలకు తీవ్రగాయాలైన కవియరసన్‌ను కుంభకోణం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని తలలో రక్తం గడ్డ కట్టడంతో మెరుగైన చికిత్స కోసం తంజావూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తంజావూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందాడు. కేసు నమోదుచేసిన పట్టీశ్వరం పోలీసులు, 15 మంది ప్లస్ వన్ విద్యార్థులను అరెస్ట్ చేసి బాలల కోర్టులో హాజరుపరచి జువైనల్ హోంకు తరలించారు.



కవియరసన్ (ఫైల్ ఫొటో)

తండ్రి మొదటి వర్ధంతి

● తిరుచెందూర్ ఆలయ ఏనుగుకు చెరకు గడలు అందించిన మావటి కుమార్తెలు

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ ఆలయ ఏనుగుకు మృతిచెందిన మావటి కుమార్తెలు చెరకు గడలు అందజేశారు. తిరుచెందూర్ ఆలయంలో 'దేవయాని' అనే ఏనుగును సంరక్షిస్తున్నారు. ఈ ఏనుగు గత ఏడాది నవంబరు 18వ తేది మావటి ఉదయకుమార్, అతని బంధువు ఒకరిపై దాడిచేయడంతో, ఇద్దరు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ నేపథ్యంలో, ఏనుగు మావటి మృతిచెందిన దినంలోని నక్షత్రం ప్రకారం ఆయన తొలి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు గత శుక్రవారం కేరళ రాష్ట్రం తిరువనంతపురం సమీపంలోని తిరువల్లాలో ఉన్న పరశురామన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉదయకుమార్ కుమార్తెలు అక్షర ఉదయన్ (16), అహల్య ఉదయన్ (15)లు తిరుచెందూర్ ఆలయానికి వచ్చారు. వారిద్దరు ఏనుగు బసచేసిన ప్రాంతానికి వెళ్లారు. అక్కడ తండ్రిని హతమార్చిన ఏనుగు దేవయానికి చెరకు, అరటి పండ్లు, ఆపిల్, పైనాపిల్ వంటి పండ్లు అందించారు. అనంతరం వారిద్దరు ఏనుగుకు సాష్టాంగ నమస్కారం చేసి ఆశీస్సులు పొందారు. ఈ దృశ్యం అక్కడున్న భక్తులను కంటతడి పెట్టించింది.



నామక్కల్ ఆంజనేయుడి అభిషేకాలకు ముందస్తు రిజర్వేషన్ ప్రారంభం

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ ఆంజనేయుడి ఆలయంలో వచ్చే 2026వ సంవత్సరం అభిషేకాలకు ముందుస్తు రిజర్వేషన్ ఆదివారం నుంచి ప్రారంభమైంది. నామక్కల్ నగరం మధ్యలో ఒకేరాతితో చెక్కబడిన 18 అడుగుల ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ప్రతిరోజు ఉదయం ఆలయాన్ని తెరిచి, ఉదయం 9 గంటలకు స్వామివారికి 1,008 వడమాలను ధరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. అనంతరం 10 గంటలకు నూనె, తేనె, పాలు, పెరుగు, పసుపు, చందనం సహా పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, మధ్యాహ్నం 1 గంటకు ప్రత్యేక అలంకారం తదితరాలు జరుగుతుంటాయి. ఆంజనేయస్వామికి ప్రతిరోజు అభిషేకం, వడమాల అలంకారంలో పాల్గొనే భక్తులు ఒక సంవత్సరం ముందుగానే రిజర్వేషన్ చేసుకునే వసతి ఉంది. ఆ ప్రకారం, 2026వ సంవత్సరానికి స్వామికి అభిషేకం రిజర్వేషన్ ప్రారంభమైంది. ఈ విషయమై హిందూ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇళయరాజా మాట్లాడుతూ... రాబోయే 2026వ సంవత్సరంలో ఒకరోజు వడమాల అలంకారం, అభిషేకం కోసం గతంలో ఉన్నట్లే, తలా రూ.7 వేల చొప్పున ఆరుగురు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. స్వామికి అభిషేకం చేయాలనుకునే భక్తులు ఆలయ పరిపాలన కార్యాలయంలో పూర్తి మొత్తం చెల్లించి, అభిషేక తేదిని రిజర్వ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలు ఆలయ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు.



బాలికకు లైంగిక వేధింపులు

● మ్యూజిక్ టీచర్‌కు యావజ్జీవ జైలుశిక్ష

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన కేసులో, మ్యూజిక్ టీచర్‌కు యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ ఊటీ మహిళా కోర్టు తీర్పు వెలువరించింది. కున్నూర్ ప్రాంతానికి చెందిన 14 ఏళ్ల బాలిక ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. బాలికకు సంగీతం నేర్చుకోవాలనే ఆసక్తి ఉండడంతో, తల్లిదండ్రులు ఆమెను అరువంగాడులోని సంగీత శిక్షణ పాఠశాలలో గత 2023 నవంబరులో చేర్పించారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రశాంత్ (50) బాలికతో సఖ్యతగా ఉంటూ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. 2024 మే 3వ తేది బాలిక హఠాత్తుగా అస్వస్థతకు గురికావడంతో, తల్లిదండ్రులు ఆమెను కున్నూర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు, ఆమె గర్భవతిగా ఉందని నిర్ధారించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కున్నూర్ మహిళా పోలీసు ఇన్‌స్పెక్టర్ గోమతి నేతృత్వంలోని పోలీసులు విచారణ చేపట్టి, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, ప్రశాంత్‌ను 2024 మే 7వ తేది అరెస్ట్ చేశారు. ఈ కేసు ఊటీ మహిళా కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో న్యాయమూర్తి ఎం.సెంథిల్ కుమార్... నేరం నిరూపితం కావడంతో ప్రశాంత్ యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. అలాగే, బాధిత బాలికకు రూ.2 లక్షలు పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

చిరుత దాడిలో ఐదేళ్ల బాలుడి మృతి

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా వాల్పారై సమీపంలో చిరుత దాడిలో ఐదేళ్ల బాలుడు మృతిచెందాడు. అయ్యర్పాడి ఎస్టేట్‌లో జీఈ బంగ్లా డివిజన్ టీ ఎస్టేట్ కార్మికుల నివాసగృహాలు ఉన్నాయి. ఇక్కడ తమిళులతో పాటు ఉత్తరాది వాసులు కూడా బసచేస్తున్నారు. వీరిలో అసోం రాష్ట్రానికి చెందిన రోజావలి-షాజితా బేగం దంపతులు నివాసం ఉంటూ టీ ఎస్టేట్‌లో పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో, శనివారం రాత్రి 7 గంటల సమయంలో తల్లిదండ్రులు ఇంట్లో ఉండగా, సైఫుల్ ఆలం (5) తన అన్నతో కలిసి ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో టీ ఎస్టేట్ నుంచి వచ్చిన చిరుత పులి సైఫుల్ ఆలంను నోటకరుచుకుని ఎత్తుకెళ్లింది. బాలుడిని చిరుత ఎత్తుకెళ్లడం గమనించిన కొందరు వాల్పారై అటవీ శాఖకు తెలియజేశారు. అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. కొద్ది దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలోని మదురైవీరన్ ఆలయం వెనుక వైపున బాలుడు గొంతు, శరీరమంతా రక్తగాయాలతో మృతిచెంది ఉండడం గుర్తించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్పారై ప్రభుత్వాసుపత్రికి తరలించిన అటవీ సిబ్బంది, చిరుతను బంధించే ప్రయత్నాలు చేపట్టారు.



మృతుడు సైఫుల్ ఆలం

తల్లి మృతి తట్టుకోలేక కుమారుడి ఆత్మహత్య

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లి మృతి తట్టుకోలేక కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరునల్వేలి జిల్లాలో చోటుచేసుకుంది. సివందిపురం శక్తినగర్ ప్రాంతానికి చెందిన వేలాయుధం (25) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. వేలాయుధానికి మద్యం తాగే అలవాటు ఉంది. చిన్నతనంలోనే తండ్రి మృతిచెందాడు. ఈ నెల 9వ తేది తల్లికూడా మృతిచెందింది. తల్లి మృతితో తీవ్ర మనోవేదనకు గురైన వేలాయుధం ఎవరితో మాట్లాడకుండా దిగులుగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో నుంచి దుర్గంధం వస్తుండడంతో చుట్టుపక్కల వారు విక్రమసింగపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటి తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లగా ఉరేసుకున్న స్థితిలో వేలాయుధం మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



వేలాయుధం (ఫైల్ ఫొటో)

కోవైలో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

● ముగ్గురిపై గూండా చట్టం ప్రయోగం

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోవై విమానాశ్రయం సమీపంలో గత నెల 2వ తేదీన కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడి జైలుపాలైన ముగ్గురిపై గూండా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ శరవణ సుందర్ పేర్కొన్నారు. అత్యాచారం కేసుకు సంబంధించి శివగంగ జిల్లా సింగంపునారికి చెందిన సతీష్, కార్తీక్ సోదరులు, మదురైకి చెందిన గుణ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం కోవై కేంద్ర కారాగారంలో బందీలుగా ఉన్న ఈ ముగ్గురికి వ్యతిరేకంగా 50పేజీల ఛార్జిషీటును కోవై కోర్టులో దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో, కోవై నగర పోలీస్ కమిషనర్ శరవణ సుందర్ గూండా చట్టం కింద అత్యాచార నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు విచారణను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టినట్లు ఆయన ఆదివారం మీడియాకు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న పోలీసు అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కారులో దాచి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పోలీసు కటకటాలపాలయ్యాడు. తిరుచ్చి ఎయిర్‌పోర్ట్ సమీపం కావేరి నగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు నగర ఎక్సైజ్ కార్యాలయానికి ఫిర్యాదు అందింది. పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రోడ్డు పక్కగా నిలిపి ఉంచిన కారులో మద్యం బాటిళ్లు ఉంచి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో... అతని పేరు హిదయతుల్లా (33) అని, రాంజీనగర్ పోలీసు స్టేషన్‌లో పోలీసుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఓ వివాహం సందర్భంగా మద్యం కొనుగోలు చేసినట్లు హిదయతుల్లా చెప్పినా ఎక్సైజ్ పోలీసులు అంగీకరించలేదు. కారు, ఒక సెల్‌ఫోన్, సుమారు రూ.లక్ష విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరచి తిరుచ్చి కేంద్ర కారాగారానికి తరలించారు. కాగా, హిదయతుల్లా భార్య కూడా పోలీసు.

రూ.17లక్షల మోసం.. ఒకరి అరెస్ట్

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై హార్బర్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.17లక్షలు మోసం చేసిన కేసులో పోలీసులు ఓ వ్యక్తిని శనివారం అరెస్ట్ చేశారు. స్థానిక తిరువేర్కాడు ఐశ్వర్యనగర్‌కు చెందిన కీర్తిరాజ్‌కు 2023లో ఆవడికి చెందిన ఆనందకృష్ణ (47)తో పరిచయం ఏర్పడింది. ఉద్యోగం కోసం కీర్తిరాజ్ ప్రయత్నాల్లో ఉన్న విషయం తెలుసుకున్న ఆనందకృష్ణన్ చెన్నై హార్బర్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని అతడి నుంచి రూ.17లక్షలు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా, ఉద్యోగావకాశాలు రాకపోవడంతో అనుమానించిన కీర్తిరాజ్ అతడిపై ఆవడి ఆర్థిక నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు శనివారం రాత్రి ఆనందకృష్ణన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో 20 మందికి గాయాలు

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లాలో రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో 20 మందికి గాయాలయ్యాయి. మన్నార్‌గుడి కొట్టూరు ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం తిరుత్తురైపూండి నుంచి వస్తున్న ప్రభుత్వ, మన్నార్‌గుడి నుంచి తిరుత్తురైపూండి వైపుకు వస్తున్న ప్రైవేటు బస్సులు ఊహించని విధంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న 20 మంది గాయపడ్డారు. చుట్టుపక్కల వారు, వాహనచోదకులు బస్సు శిథిలాల నుంచి క్షతగాత్రులను వెలికితీసి, తిరుత్తురైపూండి, తిరువారూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మన్నార్‌గుడి పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.



ఢీకొన్న బస్సులు

ఖాళీ మద్యం సీసాలను సేకరించాల్సిందే

● టాస్మాక్ సిబ్బందికి మంత్రి ముత్తుస్వామి ఉత్తర్వులు

ప్యారీస్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖాళీ మద్యం సీసాలను తప్పనిసరిగా సేకరించాల్సిందేనని టాస్మాక్ సిబ్బందికి ఉత్తర్వులు జారీచేసినట్లు గృహవసతి, ఎక్సైజ్‌శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి పేర్కొన్నారు. ఈరోడ్‌లో ఆదివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. టాస్మాక్ సంస్థ విక్రయిస్తున్న మద్యపానీయాలను సేవించిన మందుబాబులు అనంతరం ఖాళీ సీసాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల జంతువులకు, వ్యవసాయానికి తీరని నష్టం ఏర్పడుతోందని, అందువల్లే ఖాళీ సీసాలను వెనక్కితీసుకునే పథకాన్ని అమలుపరచాల్సిందిగా న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసిందని మంత్రి వివరించారు. ఈ పథకంకోసం న్యాయస్థానం విధించిన గడువు పూర్తయ్యేలోపు మద్యం ఖాళీసీసాలను సేకరించే పనులు చేపట్టాలని టాస్మాక్ సిబ్బందిని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

డీజీపీకి ఈడీ రాసిన లేఖ లీక్ వ్యవహారం

● సీబీసీఐడీకి విచారణ బదిలీ

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీకి ఈడీ రాసిన లేఖ లీకైన వ్యవహారాన్ని సీబీసీఐడీకి బదిలీ చేస్తూ రాష్ట్ర ఇన్‌చార్జ్ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు. ఈడీ, రాష్ట్ర డీజీపీకి రాసిన లేఖను జతచేసి పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న ఆదినారాయణన్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ పరిశీలించిన న్యాయమూర్తులు, 'ఈ లేఖ ఎలా దొరికింది' అంటూ ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ తిరుచ్చికి చెందిన న్యాయవాది పరంజ్యోతి దాఖలుచేసిన పిటిషన్ హైకోర్టు మదురై బెంచ్‌లో త్వరలో విచారణకు రానుంది. తొలిసారి విచారణ సమయంలో, ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు పోలీసు శాఖ తరఫున హైకోర్టుకు తెలియజేశారు. ఈ క్రమంలో ఈడీ అధికారులే ఈ లేఖను బహిర్గతం చేసి ఉండొచ్చు అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై సీబీసీఐడీ విచారణకు బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వ ప్రతినిధి ఇంట్లో చోరీ కేసులో నలుగురి అరెస్టు

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎంకే మాజీ ఎంపీ, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి ఏకేఎస్ విజయ్ ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో ఇద్దరు మహిళలు సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. 2021లో డీఎంకే అధికారం చేపట్టిన అనంతరం ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా విజయన్ వ్యవహరిస్తున్నారు. తంజావూరు కొత్త బస్టాండ్ సమీపంలోని శేఖరన్ నగర్‌లో నివసిస్తున్న ఆయన తరచూ ఢిల్లీకి వెళ్తుండగా, ఆయన కుటుంబం మాత్రం ఇక్కడ నివసిస్తున్నారు. గత నెల 27వ తేదీ బంధువుల ఇంటి శుభకార్యక్రమంలో పాల్గొనేందుకు విజయన్ కుటుంబ సభ్యులతో కలసి వెళ్లారు. వారు 28న ఇంటికి తిరిగి రాగా ఇంటి తలుపులు బద్దలుకొట్టి ఉండడం చూసి తమిళ విశ్వవిద్యాలయ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 87 సవర్ల నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ధర్మపురి రాయల్ నగర్‌కు చెందిన మహ్మద్ యూసఫ్ కుమారులు సాధిక్ బాషా (33), మొహద్దీన్ (37), కుమార్తె అయిషా పర్వీన్ (30), భార్య ఫాతిమా రసూల్ (54)ను పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 87 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు.

మద్యం మత్తులో కారు డ్రైవింగ్ ఐదు వాహనాల ధ్వంసం

● యువకుడి అరెస్ట్

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో అడ్డదిడ్డంగా కారు నడిపి ఐదు వాహనాలను ధ్వంసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కొళత్తూర్ పేపర్ మిల్స్ రోడ్డులో శనివారం అతివేగంగా వెళ్తున్న కారు మోటార్ బైక్‌ను ఢీకొంది. చుట్టుపక్కల వారు కారును అడ్డుకునేందుకు యత్నించగా అదే వేగంతో వెళ్లిపోయింది. అనంతరం కొళత్తూర్ తిరువీధి అమ్మన్ ఆలయ వీధి, కామరాజర్ రోడ్డు, పెరియార్ నగర్ విద్యుత్ బోర్డు కార్యాలయం మార్గంలో అతివేగంగా వెళ్లిన కారు, పలు వాహనాలను ఢీకొంది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసు కంట్రోల్ రూమ్‌కు తెలియజేశారు. దీంతో విల్లివాక్కం, అయినావరం, కొళత్తూర్ పోలీసులు గస్తీ పనులు చేపట్టారు. అయినావరం ప్రాంతంలో ఆ కారును పోలీసులు అడ్డుకున్నారు. కారును కొళత్తూర్ జవహర్ నగర్ కన్నభిరామన్ ఆలయ వీధికి చెందిన అశోక్ (28) నడిపినట్లు, అతను పూర్తిగా మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కారు ఢీకొన్న ఘటనలో దెబ్బతిన్న మూడు వాహనాల యజమానులు అందజేసిన ఫిర్యాదులతో పోలీసులు విచారణ చేపట్టారు.

కులగణన చేపట్టాలని 17న ఆందోళన: పీఎంకే

పెరంబూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన సత్వరం చేపట్టాలని కోరుతూ ఈ నెల 17న నగరంలో ఆందోళన చేపట్టనున్నట్లు డా.అన్బుమణి ప్రకటించారు. ఈ ఆందోళనలో అన్ని పార్టీల నేతలు, సమాజ శ్రేయోభిలాషులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో.... మనుషులు రోగాల బారిన పడిన సమయంలో చికిత్సలు కాకుండా, అసలు ఆ రోగానికి కారణాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ప్రకారం, సమాజంలో వెనుకబడిన వారిని గుర్తించేందుకు కులగణన ఒక స్కానర్ అని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న 69 శాతం రిజర్వేషన్లు గందరగోళంగా ఉన్నాయన్నారు. వెనుకబడిన వర్గాలను గుర్తించి, వారి అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు కులగణన సరైన విధానమని అన్నారు. ఈ డిమాండ్‌తో ఈ నెల 17న నగరంలో ఆందోళన చేపట్టనున్నట్లు అన్బుమణి తెలిపారు.

బీజేపీ మాయాజాలం రాష్ట్రంలో ఫలించదు

● మంత్రి రఘుపతి

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మాయాజాలం రాష్ట్రంలో ఫలించదని మంత్రి రఘుపతి వ్యాఖ్యానించారు. పుదుకోటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... తిరుప్పరంగుండ్రం వ్యవహారాన్ని చూపి బీజేపీ రాష్ట్రంలో కాలుపెట్టేందుకు యత్నిస్తుందన్నారు. రాష్ట్ర హిందువులు భారతదేశంలోని హిందువులకంటే భిన్నంగా ఉంటారన్నారు. ఈ కారణంగా బీజేపీ మాయాజాలం రాష్ట్రంలో ఫలించే అవకాశం లేదన్నారు. తిరుప్పరంగుండ్రం వ్యవహారంలో ఏది సరైనది, ఏది తప్పు అని రాష్ట్ర ప్రజలు నిర్ణయిస్తారని మంత్రి తెలిపారు.

ప్రజల మధ్య చీలికనే వ్యతిరేకిస్తున్నాం

● మంత్రి శేఖర్‌బాబు

అడయార్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తాము సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తామని చెప్పడంలేదని, కేవలం ప్రజలమధ్య చీలిక తేవడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక ప్యారీస్‌లోని కాళికాంబాల్ ఆలయంలో రాజగోపురం ఎత్తుపెంచే నిర్మాణ పనులకు శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికాలాలైనా సనాతన ధర్మాన్ని నిర్మూలించలేరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అంటున్నారని, తాము సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తామని ఏనాడూ చెప్పలేదన్నారు. ఒక అంశాన్ని ఆధారంగా చేసుకుని ప్రజలమధ్య చీలిక తేవడాన్ని మాత్రమే తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. సనాతనధర్మం అనేది ఎంతో ఉన్నతమైనన్నారు. అన్నిస్థాయిల్లో సమానంగాచూడటమే సనాతన ధర్మంలోని అతి ముఖ్య అంశమన్నారు. సనాతన ధర్మం అంటే ప్రజల మధ్య చిచ్చుపెట్టి విభజన చేయడం కాదని మంత్రి పీకే శేఖర్‌బాబు అన్నారు.

వ్యాపార కాంప్లెక్స్‌కు భూమిపూజ

వేలూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆనైకట్టులో కొత్త వ్యాపార కాంప్లెక్స్ నిర్మాణపనులకు భూమి పూజ ఆదివారం జరిగింది. డీఎంకే జిల్లా సెక్రటరీ,ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని భూమి పూజ చేసి నిర్మాణాలు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కమిటీ సెక్రటరీ బాబు, యూనియన్ సెక్రటరీ ఏరిపుదూర్ వెంకటేశన్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ప్రకాష్, ఆర్గనైజర్ హరిప్రసాద్ జిల్లా పంచాయతీ కమిటీ సభ్యులు కృష్ణమేనన్, సి.భాస్కరన్, అప్పుకల్ పంచాయతి సెక్రటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరీనా తీరంలో తల లేని మహిళ మృతదేహం

అడయార్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరంలో తల లేని ఓ మహిళ మృతదేహం (మొండెం)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 35 ఏళ్ల వయస్సున్న ఓ మహిళ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటాన్ని గమనించిన పోలీసులు స్వాధీనం చేసుకుని జీహెచ్‌కు శవపరీక్ష కోసం తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆ మృతురాలు ఎవరు? అనే దానిపై ఆరా తీస్తున్నారు. ఈ దర్యాప్తులో భాగంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో కనిపించకుండా పోయిన వారి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.